
సాక్షి
కాకినాడ
శుక్రవారం । 29 । మార్చి । 2024



రూ.1,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి వక్కలంక వేంకటేశ్వరరావు, సూర్య కుమారి దంపతులు (ఏలేశ్వరం) రూ.1,00,116 విరాళం గురువారం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడిచారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర (సా॥)	సెహరీ శని (ఉ॥)
రాజమహేంద్రవరం	6.24	4.38
కాకినాడ	6.24	4.38
అమలాపురం	6.24	4.38

న్యూస్‌రీల్

జిల్లా కలెక్టర్‌గా నివాస్



కాకినాడ సిటీ: జిల్లా కలెక్టర్‌గా జె.నివాస్ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం వైద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బదిలీపై జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకూ ఇక్కడ కలెక్టర్‌గా పని చేస్తున్న కృతికా శుక్లా ఆరు నెలల ప్రసూతి సెలవుపై వెళ్లారు. జిల్లాల విభజనలో భాగంగా ఆమె 2022 ఏప్రిల్ 4న నూతన కాకినాడ జిల్లా మొట్ట మొదటి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. దాదాపు రెండేళ్ల పాటు పని చేశారు. వివాదరహితురాలిగా పేరొందారు. జిల్లాను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేశారు.

రత్నగిరిపై భక్తుల కిటకిట



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయానికి గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. బుధవారం రాత్రి, గురువారం తెల్ల వారుజామున రత్నగిరిపై, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవ దంపతులు వారి బంధుమిత్రులతో కలిసి అధిక సంఖ్యలో సత్యదేవుని వ్రతాలాచరించి, స్వామివారిని దర్శించారు. వీరితో పాటు సాధారణ భక్తులు కూడా రావడంతో ఆలయంలో తీవ్ర రద్దీ ఏర్పడింది. గురువారం కావడంతో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరులను నిజరూపంలో దర్శించుకుని భక్తులు పులకించారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని, దర్శించి పూజలు చేశారు. సుమారు రెండు వేల వ్రతాలు జరిగాయి. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రదక్షిణ దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో నాలుగు వేల మందికి భోజనం పెట్టారు.

రబీ ధాన్యం కొనుగోలుపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: రబీ ధాన్యం కొనుగోళ్లపై జిల్లాలోని 214 రైతు భరోసా కేంద్రాల్లోని సంబంధిత సిబ్బందికి కలెక్టరేట్‌లో అధికారులు గురువారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ. ధాన్యం కొనుగోళ్లలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చూడాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. గ్రామ, మండల స్థాయిల్లో ప్రణాళికలు తయారు చేసుకుని, గోనె సంచులను, జీపీఎస్ అమర్చిన వాహనాలను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఎన్నికల నియామవళి తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎం.బాలసరస్వతి, ఏడీఏలు, ఎంఏఓలు, వీఏఏ, వీహెచ్ఏ తదితరులు పాల్గొన్నారు.

'భవిత' విద్యార్థుల ఉపకరణాల పంపిణీకి ప్రత్యేక శిబిరం

కాకినాడ సిటీ: సమగ్ర శిక్ష, సహిత విద్యా విభాగం ఆధ్వర్యాన జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, భవిత సెంటర్లలో చదువుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అవసరమైన ప్రత్యేక ఉపకరణాలను సిఫారసు చేసేందుకు గురువారం శిబిరం నిర్వహించారు. స్థానిక పగోడా మునిసిపల్ కార్పొరేషన్ ప్రైమరీ స్కూల్‌లో జరిగిన ఈ శిబిరాన్ని జిల్లా విద్యా శాఖాధికారి, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పి.రమేష్ ప్రారంభించారు. ప్రభుత్వ వైద్యులు కె.సత్యసాగర్, జి.మాధురి, ఆర్.ఉమామహేశ్వరి, ఈఎన్‌టీ, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమయ్యే ఉపకరణాలను సిఫారసు చేశారు. వినికిడి పరికరాలు, ట్రై సైకిల్స్, కాలిపర్స్, వీల్‌చైర్స్, రోలేటర్స్, వాకర్స్, ప్రోథెటిక్, వైట్ కేన్‌స్టిక్, సీపీ వాకర్స్, సీపీ చైర్స్, బ్లైండ్ స్టిక్స్, బ్రెయిలీ కిట్ తదితర ఉపకరణాలను సిఫారసు చేశారు. ఈ శిబిరంలో 110 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. సమగ్ర శిక్ష జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్బన్ మండలం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ సీహెచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్.. టెన్షన్

- శుభకార్యాలపై 'కోడ్' ఎఫెక్ట్
- సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంక్షలు
- ముమ్మరంగా పోలీసుల తనిఖీలు
- నగదు రూ.50 వేలు మించితే సీజ్
- ఐటీకి భయపడి ఆన్‌లైన్ చెల్లింపులకు అంగీకరించని వ్యాపారులు
- బంగారం, పెళ్లి దుస్తులు, ఇతర సామగ్రి కొనేందుకు తిప్పలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు



కాకినాడ సిటీ: శుభకార్యాలపై ఎన్నికల కోడ్ ఎఫెక్ట్ పడింది. ప్రస్తుతం శుభ ఘడియలు నడుస్తున్నాయి. ఏప్రిల్ 26వ తేదీ వరకూ సుముహూర్తాలు ఉండటంతో అనేక మంది తమ పిల్లలకు సంబంధాలు కుదుర్చుకుని, వెంటనే పెళ్లిళ్లు కూడా చేస్తున్నారు. ఇందులో భాగంగా వధూవరుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున షాపింగ్ చేయడం, విందు భోజనాలకు అవసరమైన నిత్యావసరాల కొనుగోలుతో పాటు ఫంక్షన్ హాళ్ల బుకింగ్, పెళ్లి దుస్తులు, బంగారు ఆభరణాలు, ఫర్నిచర్, వంట సామగ్రి, వాహనాలు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడే వారికి అసలు చిక్కు వచ్చి పడుతోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమలులో ఉండటం, రూ.50 వేలకు మించి నగదు తీసుకుని వెళ్తే తనిఖీల్లో భాగంగా పోలీసులు వాటిని సీజ్ చేస్తూండటం వధూవరుల తల్లిదండ్రులకు ఇబ్బందిగా మారింది.

ఆన్‌లైన్ చెల్లింపులకు నిరాకరణ

ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆన్‌లైన్ చెల్లింపులపై ఐటీ ఆంక్షలు కొనసాగుతూండటంతో అత్యధిక శాతం వ్యాపారులు ఇప్పటికీ నగదు చెల్లింపులకే ఆసక్తి చూపుతున్నారు. ఆన్‌లైన్ చెల్లింపులపై సీఎస్‌టీ, జీఎస్‌టీలు ఉండటమే దీనికి కారణం. ముఖ్యంగా బంగారం ఆభరణాలు విక్రయించే వ్యాపారులు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు, కేటరింగ్ సంస్థలు, హోటళ్లు, వంట మనుషుల వంటి వారు చెక్కులు, ఆన్‌లైన్ నగదు చెల్లింపులను స్వీకరించడం లేదు. వీరందరూ ఐటీ భయంతోనే ఇలా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. దీంతో పెద్దపెద్ద వాటికే కాదు.. చిన్నచిన్న అవసరాలకు సైతం నగదు పైనే ఆధారపడాల్సి వస్తోంది. ప్రతి దానికీ పెళ్లి కార్డు, ఆన్‌లైన్ చెల్లింపులకు సంబంధించిన బిల్లులు వెంట తీసుకుని వెళ్లాల్సి వస్తోంది. అలా కాకుంటే పోలీసులు ఎక్కడ సీజ్ చేస్తారోననే భయం పెళ్లి బృందాల వారిని వెంటాడుతోంది.

ఆస్తులు తాకట్టు పెట్టినా పుట్టని అప్పు

ఇదిలా ఉండగా ఇళ్లల్లో శుభ కార్యాలకు పెద్ద ఎత్తున నగదు అవసరమవుతోంది. ఆశించిన స్థాయిలో ఇంట్లో నగదు లేకపోవడం, బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లపై ఆంక్షలు కొనసాగుతుండడంతో అవసరానికి స్థిరాస్తులు తాకట్టు (కుదువ) పెట్టినా మార్కెట్లో అప్పు పుట్టడం లేదు. అంతే కాదు.. బ్యాంకుల నుంచి రూ.10 లక్షలు మించి నగదు డ్రా చేస్తే వెంటనే ఐటీ అధికారులు రంగంలోకి దిగిపోతున్నారు. ఇది శుభకార్యాలు నిర్వహించుకుంటున్న వారిని మరింత ఆందోళనకు గురి చేస్తోంది. కేవలం వీరికే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు వెళ్లే రోగులకు సైతం ఎన్నికల ఆంక్షలు ఇబ్బందిగా మారాయి. అప్పు ఇచ్చి పుచ్చుకునే వారికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు.

ఆన్‌లైన్ అంటే కష్టమే

ప్రతి ఫంక్షన్ హాలులో 20 నుంచి 30 మంది వరకూ వర్కర్లు పని చేస్తూంటారు. వీరికి నగదు రూపంలోనే కూలీ చెల్లించాల్సి వస్తోంది. పూలు, పండ్లు, కూరగాయలు అమ్మే రైతులకు కూడా నగదు చెల్లించాల్సి వస్తోంది. అన్నింటికీ ఆన్‌లైన్ చెల్లింపులంటే ఐటీ నిబంధనలతో ఇబ్బంది పడాల్సి వస్తోందని ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు అంటున్నారు.

పెళ్లిళ్లకు మినహాయింపు ఇవ్వాలి



ఎన్నికల కోడ్ నుంచి పెళ్లిళ్లు చేసుకునే వారికి మినహాయింపు ఇవ్వాలి. పెళ్లి వస్తువులకు భారీగా ఖర్చులు ఉంటాయి. దుస్తులు, బంగారం తీసుకోవాలంటే నగదు లభించడం లేదు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో రూ.50 వేలకు మించి వెంట తీసుకుని వెళ్తే తనిఖీల్లో పోలీసులు సీజ్ చేస్తున్నారు. బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లపై కూడా ఆంక్షలున్నాయి. పెళ్లి పత్రిక ఉంటే రూ.2 లక్షల వరకూ మినహాయింపు ఇవ్వాలి. ఎన్నికల నిబంధనల వల్ల పెళ్లిళ్లు చేసుకునే వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– అనిశెట్టి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు, బంగారు, వెండి, డైమండ్ వర్తక సంఘం, కాకినాడ

సరైన ఆధారాలుండాలి



ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉంది. నగదు, వస్తువులు, మద్యం తరలింపుపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించింది. శుభకార్యాల వేళ నగదు వెంట తీసుకుని వెళ్లే వారు ఇబ్బంది పడుతూంటారు. వీరు తమ వెంట పెళ్లి శుభలేఖలు, సదరు నగదు ఏ బ్యాంకు అకౌంట్ నుంచి డ్రా చేశారు? ఎంత డ్రా చేశారు? ఏం కొనుగోలు చేయబోతున్నారు? వంటి వాటికి ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. ఆస్పత్రులకు వెళ్లేవారు పేషెంట్ కేస్ షీట్‌లు వెంట తీసుకుని వెళ్లాలి. సాధ్యమైనంత వరకూ వెంట నగదు తీసుకుని వెళ్లకపోవడమే ఉత్తమం. ఏ ఆధారమూ లేని నగదును మాత్రమే జిల్లా గ్రీవెన్స్ కమిటీకి, ఐటీకి అప్పగిస్తారు. తనిఖీల్లో లభించిన నగదుకు సరైన ఆధారాలు చూపిస్తే వదిలేస్తారు.

– ఎస్.సతీష్‌కుమార్, జిల్లా ఎస్పీ, కాకినాడ

కొనసాగుతున్న సైనిక విన్యాసాలు



కాకినాడ తీరంలో యుద్ధ నౌకపై విన్యాసాల్లో పాల్గొన్న రక్షణ దళాల అధికారులు, సిబ్బంది

కాకినాడ రూరల్: భారత్, అమెరికా సైనిక విన్యాసాలు కాకినాడ తీరంలో కొనసాగుతున్నాయి. మరో రెండు రోజులు పాటు జరగనున్న టైగర్ ట్రయాంఫ్ విన్యాసాల నేపథ్యంలో బీచ్ రోడ్డును పోలీసులు మూసివేశారు. భారత తూర్పు తీర నావికా దళం, ఆర్మీ, ఎయిర్స్ ఫోర్స్‌కు చెందిన సుమారు 700 మంది సైనిక సిబ్బందితో పాటు అమెరికా రక్షణ దళ అధికారులు, సిబ్బంది సూర్యారావుపేట నేవల్ ఎన్‌క్లేవ్ ప్రాంతంలోని ఓల్డ్ ఎన్టీఆర్ బీచ్‌తో పాటు విశాఖలో ఈ ఉభయ చర విన్యాసాలు నిర్వహిస్తున్నారు.

మంత్రి రాజాను కలిసిన యనమల అనుచరుడు



మంత్రి రాజాను మర్యాదపూర్వకంగా కలిసిన జగన్మోహన్

తుని: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల కృష్ణుడి ముఖ్య అనుచరుడు, రాజీవ్ గృహకల్ప మాజీ అధ్యక్షుడు శిల్పరశెట్టి జగన్మోహన్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి, సత్కరించారు. టీడీపీలో సుదీర్ఘ కాలం పని చేసినా గుర్తింపు లేదని, ప్రజలకు వైఎస్సార్ సీపీ అందిస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి రాజా పనితీరుకు ఆకర్షితుడినయ్యానని జగన్మోహన్ తెలిపారు. త్వరలో వైఎస్సార్ సీపీలో చేరి, పార్టీ కోసం కష్టపడి పని చేస్తానని చెప్పారు. ప్రజల కోసం పని చేస్తున్న వైఎస్సార్ సీపీలోకి ఎవరు వచ్చినా సాదరంగా ఆహ్వానిస్తామని రాజా ఈ సందర్భంగా అన్నారు.

పేదల గుండె చప్పుడు వైఎస్ జగన్

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- పార్టీలో లారీ డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడి చేరిక



ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన వాసు యేలేటి తదితరులు

కాకినాడ రూరల్: పేదల గుండె చప్పుడుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని, చెప్పారంటే చేస్తారంతే అన్నట్టుగా ఐదేళ్ల కాలంలో సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. జయహో రథ సారధి లారీ డ్రైవర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసు యేలేటి తన అనుచరులతో కలసి గురువారం కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ వీర వెంకట సత్యనారాయణ ప్రోత్సాహంతో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్టీఫెన్ ఆనంద్ ఆధ్వర్యాన వాసు యేలేటితో పాటు యాదగిరి రంగారావు, కిశోర్, వాపు కాంతారావు తదితర వంద మంది పార్టీలో చేరారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారికి కన్నబాబు పార్టీ కండువాలు వేసి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ ఇంటి తలుపు తట్టినా 94 శాతం ప్రజలు ఏదో ఒక విధంగా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందారని అన్నారు. ఇంటింటికీ కుళాయి మొదలుకుని రోడ్లు, డ్రైన్లు నిర్మించి పెద్ద ఎత్తున అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమం చూసి పలువురు పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని అన్నారు. సీఎం జగన్ అన్ని వర్గాలకూ సముచిత స్థానం ఇస్తున్నారని, దళిత సామాజిక వర్గానికి చెందిన లారీ డ్రైవర్‌కు టిక్కెట్ ఇచ్చి, ఎమ్మెల్యేగా అసెంబ్లీకి పంపించనున్నారని చెప్పారు. అలాగే ఉపాధి కూలీని చట్టసభలకు పంపించనున్నారన్నారు. టీడీపీ, ఇతర పార్టీలు కుబేరులను ఎన్నుకుని టిక్కెట్లు ఇచ్చారని, ఈ తేడాను ప్రజలు గమనించాలని కోరారు. లారీ డ్రైవర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకుని వెళ్తామని కన్నబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన సీఎం జగన్, అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గంలో టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే సీటు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా డ్రైవర్లు వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని నిర్ణయించుకున్నామని వాసు యేలేటి చెప్పారు. ఎమ్మెల్యే కన్నబాబు ప్రజల మనిషి అని, ఆయన సారథ్యంలో పని చేస్తామని అన్నారు. వాసు యేలేటిని, ఇతర లారీ డ్రైవర్లను తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ వీర వెంకట సత్యనారాయణ, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్టీఫెన్ ఆనంద్ అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేత జమ్మలమడక నాగమణి, క్రిస్టియన్ మైనార్టీ విభాగం నేత డేవిడ్ లివింగ్‌స్టన్, కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, రాష్ట్ర బీసీ నాయకుడు అల్లి రాజబాబు, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, తోటకూర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

1న సత్యదేవుని ఆలయ వార్షికోత్సవం

- 13వ సంవత్సరంలోకి నూతనాలయం
- వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు



సత్యదేవుని ఆలయం

అన్నవరం: సత్యదేవుని ఆలయ పునర్నిర్మాణం జరిగి వచ్చే నెల ఒకటో తేదీకి పుష్కర కాలం.. అంటే 12 సంవత్సరాలు పూర్తవుతున్నాయి. ఆలయం 13వ వసంతంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. 1891 సంవత్సరంలో (ఖర నామ సంవత్సరం) శ్రావణ శుద్ధ విదియ నాడు రత్నగిరిపై సత్యదేవుడు ఆవిర్భవించినట్టు ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. స్వామివారు ఆవిర్భవించి 133 సంవత్సరాలు పూర్తయ్యింది. స్వామివారి పురాతన ఆలయం శిథిలావస్థకు చేరడంతో 2011లో అప్పటి కార్యనిర్వహణాధికారి కె.రామచంద్ర మోహన్ హయాంలో సత్యదేవుడు, అమ్మవారు, ఈశ్వరుల మూలవిరాట్టులను కదపకుండా.. ఆ మూర్తులకు పకడ్బందీ రక్షణ ఏర్పాట్లు చేసి, పాత ఆలయాన్ని తొలగించి, నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆ ఆలయాన్ని ఫాల్గుణ బహుళ సప్తమి (మార్చి 14, 2012) నాడు అప్పటి కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు జయేంద్ర సరస్వతి స్వామి చేతుల మీదుగా కలశ స్థాపన చేసి ప్రారంభించారు. అప్పటి నుంచీ తెలుగు తిథుల ప్రకారం ఫాల్గుణ బహుళ సప్తమి నాడు నూతన ఆలయ కలశ ప్రతిష్ఠ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. అదే సందర్భంగా వచ్చే నెల ఒకటో తేదీన ఈ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ప్రస్తుతం కూడా ఆలయ ఈఓగా రామచంద్ర మోహనే ఉండటం విశేషం.

ఆ రోజు తెల్లవారుజామున సత్యదేవుడు, అమ్మవారికి, శంకరులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయాన్ని, ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిస్తారు. స్వామివారికి బూరెలు, పులిహోర, రవ్వకేసరి ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేస్తారు. అదే విధంగా స్వామివారి గోధుమ నూక ప్రసాదం కూడా పంపిణీ చేస్తారు.

భారీ పరిశ్రమలు తీసుకువస్తా

- మెట్టకు మేలు చేస్తా
- జగనన్న చేసిన మంచి చెప్పడమే మన విజయానికి మార్గం
- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్. చిత్రంలో వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తదితరులు



సమావేశంలో పాల్గొన్న పార్టీ నేతలు, అభిమానులు, కార్యకర్తలు

జగ్గంపేట: మెట్ట ప్రాంతంపై తనకు పూర్తి అవగాహన ఉందని, ఈ ప్రాంతానికి మేలు చేసేందుకు రూ.30 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్లతో భారీ పరిశ్రమలు తీసుకుని వస్తానని వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ అన్నారు. జగ్గంపేటలో గురువారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల అభివృద్ధికి ప్రత్యేక మ్యానిఫెస్టో సిద్ధం చేసుకున్నానని చెప్పారు. నిరుద్యోగులు, యువత మంచి ఉద్యోగాలు సాధించేందుకు కాకినాడలో భారీ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తానని తెలిపారు. స్టార్టప్ ఫండ్ సమకూర్చి 100 చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో నియోజకవర్గంలోని 95 శాతం ఇళ్లకు మేలు జరిగిందని అన్నారు. ఆ మేలును ప్రతి ఇంటికీ వివరించడమే విజయానికి మార్గమని చెప్పారు. పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని 400 గ్రామాలను దత్తత తీసుకుని కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయించి, వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేసుకోవడంతో పాటు కాకినాడ ఎంపీగా తనను, జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని గెలిపించాలని, ఇందుకు పార్టీ శ్రేణులంతా 45 రోజుల పాటు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్ బస్సు యాత్ర నియోజకవర్గానికి వచ్చినపుడు ఘన స్వాగతం పలకడానికి సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సునీల్ విజ్ఞప్తి చేశారు. సభకు అధ్యక్షత వహించిన జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం మాట్లాడుతూ, పార్టీ నేతల మధ్య సమన్వయానికి పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి చొరవ చూపడంతో జిల్లాలో వైఎస్సార్ సీపీ విజయశంఖారావం పూరించడం ఖాయమని అన్నారు.

మెట్టను సస్యశ్యామలం చేసేందుకు గతంలో తాను చేసిన అభివృద్ధిని వివరించారు. అనారోగ్యంతో ఉన్న తనకు దేవుడు పునర్జన్మ ప్రసాదిస్తే, జగనన్న రాజకీయ పునర్జన్మ ఇచ్చారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయబోనని అన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు పి.శివకుమార్ మాట్లాడుతూ, జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, పారదర్శక పాలన వల్ల నేడు ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లి ఓట్లు అడగగలుగుతున్నామని, అదే టీడీపీకి ఓట్లు అడిగే హక్కు లేదని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త అత్తులూరి సాయిబాబు, యువ నేత తోట రాంజీ, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్‌వెస్లీ, గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేతలు గుల్లా ఏడుకొండలు, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఘన విజయం తథ్యం

మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం



ముద్రగడను కలిసిన పిఠాపురం రూరల్ నాయకులు, కాకినాడ ఎంపీ అభ్యర్థి సునీల్

కిర్లంపూడి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. పిఠాపురం రూరల్ మండలంలోని 20 గ్రామాల నుంచి సుమారు 300 మంది నాయకులు, కార్యకర్తలు ఆయనను, యువ నాయకుడు గిరిబాబును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ కూడా ముద్రగడను కలిశారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా, అర్హత ఒకటే ప్రామాణికంగా అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌ను మరోసారి అధికారంలోకి తీసుకుని రావాలని విజ్ఞప్తి చేశారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి వచ్చిన ప్రతి ఒక్కరినీ సునీల్‌కు పరిచయం చేశారు.

స్పాట్‌కు సర్వం సిద్ధం

- ఒకటి నుంచి 8 వరకు టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకనం
- జిల్లాకు 1.85 లక్షల సమాధాన పత్రాలు కేటాయించే అవకాశం
- ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం


పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహించే అమలాపురంలోని పాఠశాల

రాయవరం: పదవ తరగతి పరీక్షలు ముగిశాయి. జిల్లావ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ నుంచి 112 పరీక్షా కేంద్రాల్లో పది పరీక్షలు ప్రారంభమైన విషయం విదితమే. 21,113 మంది విద్యార్థులు రెగ్యులర్, ప్రైవేట్‌గా పరీక్షలు రాయాల్సి ఉండగా, సరాసరిన 99.48 శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇప్పుడు అధికారులు జవాబు పత్రాల మూల్యాంకనంపై దృష్టి సారించారు. గత విద్యా సంవత్సరంలో జిల్లా కేంద్రమైన అమలాపురంలోని బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్పాట్ వేల్యుయేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. గతేడాది ఏప్రిల్ 19న ప్రారంభమైన స్పాట్ వేల్యుయేషన్ 26వ తేదీ వరకు ఆరు రోజుల పాటు నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే జవాబు పత్రాల మూల్యాంకనాన్ని అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలతో పాటుగా, బాలికల ఉన్నత పాఠశాలలో కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి వచ్చిన పరీక్ష పేపర్ల కోడింగ్ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటలకు జవాబు పత్రాల మూల్యాంకనం చేపట్టనున్నారు.

దఫదఫాలుగా జవాబు పత్రాలు

ఈ ఏడాది వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1.85 లక్షల జవాబు పత్రాలను మూల్యాంకనం చేసే అవకాశముంది. మూల్యాంకన ప్రక్రియను సమర్థంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు తలమునకలయ్యారు. ఇప్పటికే పూర్తయిన పది పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలు వివిధ జిల్లాల నుంచి దఫదఫాలుగా వస్తున్నాయి. ఇప్పటి వరకు తెలుగు, కాంపోజిట్ తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, పీఎస్ సబ్జెక్టులకు సంబంధించిన జవాబు పత్రాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. బయాలాజికల్ సైన్స్, సోషల్, ఒకేషనల్, ఓఎస్ఎస్ సబ్జెక్టులకు చెందిన జవాబు పత్రాలు రావాల్సి ఉంది. ఆయా జిల్లాలకు జిల్లా విద్యాశాఖ అధికారి క్యాంప్ ఆఫీసర్‌గా, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. వీరితోపాటు అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు జవాబు పత్రాల మూల్యాంకనంలో పాల్గొననున్నారు. గతేడాది 1,84,083 జవాబు పత్రాల మూల్యాంకనం చేపట్టారు. తెలుగు 25,168, కాంపోజిట్ తెలుగు-3,457, సంస్కృతం-2,163, హిందీ 29,058, ఇంగ్లిషు-24,209, గణితం-24,017, పీఎస్-24,781, బయాలజీ-24,781, సోషల్-26,307, వొకేషనల్ 142 పేపర్లను జిల్లాకు కేటాయించారు. ఈ ఏడాది కూడా అంతే స్థాయిలో జిల్లాకు కేటాయించే అవకాశముంది.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు	:	01
స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జి	:	01
అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు	:	07
ఏపీసీవోలు	:	07
చీఫ్ ఎగ్జామినర్లు	:	99
అసిస్టెంట్ ఎగ్జామినర్లు	:	594
స్పెషల్ అసిస్టెంట్లు	:	198

సబ్జెక్టుల వారీగా..

పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకన విధులకు ఆయా సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమిస్తూ ఇప్పటికే ఉత్తర్వులను సిద్ధం చేసే పనిలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఉంది. స్పాట్ వేల్యుయేషన్ ఉత్తర్వులను సంబంధిత ఉపాధ్యాయులకు ఒకటి రెండు రోజుల్లో అందజేయనున్నట్లు సమాచారం. ఏడు సబ్జెక్టులు, ఒకేషనల్ పరీక్షలు కలిపి మొత్తం ఎనిమిది రోజులు పాటు మూల్యాంకనం చేస్తారు.

నిబంధనలు..

మూల్యాంకన విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులు సెల్‌ఫోన్, స్మార్ట్‌ఫోన్లు, వైట్నర్, ఎరేజర్ తదితర వస్తువులను మూల్యాంకనం గదిలోకి తీసుకువెళ్లరాదు. ప్రతి రోజు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మూల్యాంకనం జరుగుతుంది. మూల్యాంకన సమయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎటువంటి తప్పిదాలు జరిగినా బాధ్యత వహించాల్సి ఉంటుంది. శిబిరానికి నిర్దేశిత సమయాల్లో హాజరు కాకుంటే, అటువంటి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు.

కోడింగ్ చేస్తున్నాం



ఇప్పటి వరకు జిల్లా కేంద్రానికి చేరుకున్న జవాబు పత్రాలను కోడింగ్ చేస్తున్నాం. రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం స్పాట్ వేల్యుయేషన్‌కు నియమ నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేస్తున్నాం.
– నక్కా సురేష్, అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల విభాగం, అమలాపురం

అసౌకర్యం కలగకుండా..



ఇన్విజిలేటర్లకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నాం. జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. నిర్ణీత సమయంలో మూల్యాంకనం పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నాం.
– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

ఎవరికీ మినహాయింపులు ఉండవు



మూల్యాంకన విధులకు నియమితులైన వారు తప్పనిసరిగా విధులకు హాజరు కావాల్సి ఉంది. స్పాట్ వేల్యుయేషన్‌లో ఎవరికీ మినహాయింపులు ఉండవు. సకాలంలో మూల్యాంకనం జరిగేలా ఉపాధ్యాయులు సహకరించాలి.
– జి.నాగమణి, రీజనల్ జాయింట్ డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ.

క్లుప్తంగా

కోడ్‌కు లోబడి 'స్థాయీ' సమావేశాలు



కాకినాడ సిటీ: జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన గురువారం జెడ్పీ సమావేశపు మందిరంలో 1, 2, 4, 7 స్థాయి సంఘాల సమావేశాలు జరిగాయి. 3వ స్థాయీ సంఘ సమావేశం జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన, 5వ స్థాయీ సంఘ సమావేశం జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి అధ్యక్షతన జరిగాయి. 6వ స్థాయీ సంఘ సమావేశం జెడ్పీ వైస్ చైర్పన్ మేరుగు పద్మలత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశాల్లో జెడ్పీటీసీ సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఏ విధమైన శాఖపరమైన సమీక్షలుగానీ, తీర్మానాలుగానీ ఆమోదించకుండా స్థాయీ సంఘ సమావేశాలు ముగిశాయి. జిల్లా పరిషత్ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి, డిప్యూటీ సీఈవో జీఎస్ రామ్‌గోపాల్, ఆయా జిల్లాల వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లా ప్రజాపరిషత్ పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు శశికళ



అమలాపురం రూరల్: ఇందుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థి ఉండుర్తి శశికళ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయింది. కాకినాడ వాకలపూడిలో జరిగిన ఎంపికల్లో 65 కేజీల పవర్ లిఫ్టింగ్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచింది. ఈ నెల 30, 31వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ అండర్- 17 పోటీలకు విభాగానికి ఎంపికైనట్లు హెచ్ఎం విత్తనాల శ్రీనివాసరావు, పీఈటీ బుజ్జి తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన శశికళను సర్పంచ్ చొల్లంగి శివాని, ఎస్ఎంసీ చైర్మన్ అభినందించారు.

మండల పరిషత్ కార్యాలయంలో చోరీ

మానిటర్ దొంగిలించుకుపోయిన వైనం

గండేపల్లి: జాతీయ రహదారి, పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలో గల మండల పరిషత్ కార్యాలయంలో చోరీ సంఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు కార్యాలయం మెయిన్ ద్వారం తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించిన గుర్తుతెలియని చోరులు ఈఓఆర్డీ, రికార్డ్స్, ఎండీఓ, ఇతర గదుల తాళాలు పగులగొట్టి, గెడలు వంచి లోపలికి ప్రవేశించారు. అక్కడ ఏమి లేకపోవడంతో వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధించిన మానిటర్‌ను దొంగిలించుకుపోయినట్టు తెలిపారు. సోమవారం ఉదయం అటెండర్ విధులకు వచ్చేసరికి కార్యాలయం మెయిన్ డోర్ తాళాలు పగులగొట్టి ఉండటంతో ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. కార్యాలయం వద్దకు చేరుకున్న ఏఓ చంద్రరావు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు. చోరీకి గురైన మానిటర్ విలువ రూ.50,000 ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా అదే రోజు జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలోను గుర్తుతెలియని చోరులు కార్యాలయ తాళాలు పగులగొట్టారని, ఎటువంటి వస్తువులు చోరీకి గురికాలేదని తెలిసింది.

సాంకేతిక లోపంతో నిలిచిన షాలిమార్ ఎక్స్‌ప్రెస్

- ఐదున్నర గంటల ఆలస్యం
- రెండు గంటల పాటు ఆగిన ఈస్ట్‌కోస్ట్
- ఆందోళనకు దిగిన ప్రయాణికులు


నిలిచిపోయిన షాలిమార్ ఎక్స్‌ప్రెస్


స్టేషన్ మాస్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన ప్రయాణికులు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో రెండు రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు స్టేషన్ మాస్టర్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. గురువారం ఉదయం 5 గంటలకు రావాల్సిన షాలిమార్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (22849) రెండున్నరగంటలు ఆలస్యంగా 7.35 గంటలకు చేరుకుంది. రైలు బయలుదేరినప్పటినుంచి జనరేటర్‌లో లోపాలు తలెత్తడంతో ముందుకు వెళ్లలేక స్టేషన్‌లో రెండో నంబర్ ప్లాట్‌ఫారంపై నిలిచిపోయింది. అదే సమయంలో ఉదయం 7.45 గంటలకు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు చేరుకోవాల్సిన ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045) రెండు గంటలు ఆలస్యంగా 10 గంటల సమయంలో చేరుకుంది. షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లో తలెత్తిన సాంకేతిక లోపం సరిదిద్దేందుకు ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను మొదటి ప్లాట్‌ఫారంపై నిలిపివేశారు. సుమారు రెండుగంటల పాటు ప్రయత్నించినా ఏ విధమైన ప్రయోజనం లేక పోవడంతో ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను 11.55 గంటల సమయంలో పంపించివేశారు. షాలిమార్ ఎక్స్‌ప్రెస్ మరమ్మతులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో స్టేషన్ మాస్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. రైల్వే శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఐదున్నర గంటల తరువాత ఒంటి గంట సమయంలో షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌కు రెండు ఇంజిన్‌లను అమర్చి సికింద్రాబాద్ పంపించారు. స్టేషన్‌లో జీఆర్పీ,ఆర్పీఎస్ సిబ్బంది భద్రతా చర్యలు చేపట్టారు.

ఇప్పటి వరకు రూ.15 లక్షల సీజ్

- తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ జగదీష్
- గోకవరంలో చెక్‌పోస్టుల తనిఖీ


గోకవరంలో సీఐ నాగమురళి, ఎస్సై నాగరాజుకి సూచనలిస్తున్న ఎస్పీ జగదీష్

గోకవరం: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ చెక్‌పోస్టుల ద్వారా రూ.15 లక్షల వరకు నగదును సీజ్ చేసినట్టు జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. గోకవరంలో రంపచోడవరం వెళ్లే మార్గంలోని చెక్‌పోస్టును గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల ద్వారా ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామన్నారు. రంపచోడవరం నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేసేందుకు అదనంగా చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. గతంలో జరిగిన సంఘటనల దృష్ట్యా పలు ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజలు స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో ఓటు హక్కుని వినియోగించుకోవడానికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. వివిధ పనుల నిమిత్తం ప్రజలు రూ.50 వేల వరకు వెంట తీసుకు వెళ్లవచ్చన్నారు. అంతకుమించి ఎక్కువ నగదు పట్టుకెళ్లినప్పుడు పట్టుబడితే సంబంధిత పత్రాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీ దృష్టికి తీసుకువెళితే పరిశీలించి 24 గంటల్లో విడుదల చేస్తామన్నారు. రూ.10 లక్షలకు మించి నగదు పట్టుకెళితే ఇన్‌కం ట్యాక్స్ అధికారులు పరిశీలించి విడుదల చేస్తారన్నారు. ఆయన వెంట కోరుకొండ సీఐ అడపా నాగమురళీ, ఎస్సై కె.నాగరాజు ఉన్నారు.

రెండు ఇళ్లు దగ్ధం

- నిరాశ్రయులైన రెండు కుటుంబాలు
- రూ.6 లక్షలకు పైగా ఆస్తినష్టం


కాలి బూడిదయిన ఇంటి వద్ద బాధితుడు

పిఠాపురం: కొత్తపల్లి మండలం కొమరగిరిలో గురువారం తెల్లవారుజామున సంభవించిన అగ్నిప్రమాదంలో ఒక తాటాకు ఇల్లు అగ్నికి ఆహుతి కాగా రూ.6 లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించినట్టు స్థానికులు తెలిపారు. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొమరగిరికి చెందిన సంగాడి చిట్టిబాబుకు చెందిన ఇంట్లో అతని కుమారుడితో సహా రెండు కుటుంబాలు నివాసముంటున్నాయి. గురువారం తెల్లవారుజామున అకస్మాత్తుగా ఇంట్లో మంటలు చెలరేగడంతో ఇంట్లో నిద్రపోతున్న వారంతా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బయటకు పరుగులు తీశారు. ప్రాణాలపై ఆశతో కట్టుబట్టలతో బయటపడగా ఇంట్లో ఉన్న పది తులాల బంగారం, రూ 3 లక్షల నగదు, చేపల వేటకు ఉపయోగించే వలలు ఇంట్లో ఉన్న సామగ్రి కాలి బూడిదయ్యింది. పిఠాపురం అగ్నిమాపకాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు.

భార్య దాడితో భర్త మృతి

ఘర్షణలో కుమారుడికి గాయాలు


మృతుడు వెంకట్ (ఫైల్)


చికిత్స పొందుతున్న కృష్ణవంశీ

ఉండ్రాజవరం: భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణలో భర్త మృత్యువాత పడగా, కుమారుడు కత్తిపోటు గాయానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెంకు చెందిన గుల్లంకి వెంకట్(44)కు, ఉండ్రాజవరం గ్రామానికి చెందిన పార్వతికి 20 ఏళ్ల క్రితం వివాహం కాగా, వారికి కొడుకు, కూతురు ఉన్నారు. అయితే పది ఏళ్లుగా భార్యాభర్తలు విడిగా ఉంటున్నారు. వెంకట్ తన స్వగ్రామం తాడేపల్లిగూడెంలో ఉంటుండగా, పార్వతి తన ఇద్దరూ పిల్లలతో ఉండ్రాజవరంలో జీవనం సాగిస్తున్నారు. వెంకట్ అప్పుడప్పుడూ వచ్చి పార్వతిని తనతో వచ్చేయమని గొడవ పడుతుండేవాడు. ఇటీవల కుమార్తె పెళ్లి కారణంగా వచ్చిన వెంకట్ పది రోజులు నుంచి ఉండ్రాజవరంలోనే ఉంటున్నాడు. బుధవారం రాత్రి పార్వతి తనతో వచ్చేయాలంటూ మళ్లీ గొడవకు దిగాడు. దాంతో భార్య పార్వతి, కొడుకు కృష్ణవంశీతో తీవ్ర ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో కృష్ణవంశీని వెంకట్ కత్తితో పొడిచాడు. కొడుకు కత్తిపోటుకు గురికావడంతో చలించిన పార్వతి ఒక్కసారిగా భర్తపై ఇటుకతో దాడికి పాల్పడింది. వెంకట్ దాడిని ప్రతిఘటించే క్రమంలో తల్లీ కొడుకు ఇద్దరూ కలసి ఇటుకలతో వెంకట్ తలపై కొట్టడంతో వెంకట్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే తేరుకున్న పార్వతి గాయ పడిన భర్త, కొడుకును తణుకు ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా వెంకట్ పరిస్థితి విషమంగా ఉండటంతో తణుకు నుంచి ఏలూరు, అక్కడ నుంచి విజయవాడకు తరలించారు. గురువారం తెల్లవారుజామున వెంకట్ ఆసుపత్రిలో మృతి చెందాడు. కొడుకు కృష్ణవంశీ ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఉండ్రాజవరం ఎస్సై వి.అప్పలరాజు కేసు నమోదు చేయగా, నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరావు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజస్తంభం కళాప్రకర్షణ

22న సత్యదేవుని నూతన బంగారు ధ్వజస్తంభం ప్రతిష్ఠ


ధ్వజస్తంభం కళలను ఇత్తడి బిందెలో నిక్షిప్తం చేసి సత్యదేవుని ఆలయానికి తీసుకువెళుతున్న పండితులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని నూతన బంగారు ధ్వజస్తంభం ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తూ గురువారం ప్రస్తుత ధ్వజస్తంభం కళాప్రకర్షణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానం విశ్రాంత వేద పండితులు బ్రహ్మశ్రీ ముష్టి కామశాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం ఐదు గంటలకు స్వామివారి ఆలయం ఎదురుగా గల అనివేటి మంటపంలో పండితులు ఉదయం ఐదు గంటలకు ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కళాప్రకర్షణ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. తరువాత పండితుల మంత్రోచ్ఛాటన మధ్య ధ్వజస్తంభం కళలను బిందెలోకి ప్రవేశపెట్టి దానిని సత్యదేవుని ఆలయంలో స్వామివారి చెంత ఉంచి పూజలు చేశారు. తరువాత గోవు ద్వారా ధ్వజస్తంభాన్ని తొలగించే కార్యక్రమం ప్రారంభించారు. రెండు మూడు రోజుల్లో పూర్తిగా తొలగించామని అధికారులు తెలిపారు. సత్యదేవుని ఆలయానికి రూ.నాలుగు కోట్ల వ్యయంతో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేయడానికి నెల్లూరుకు చెందిన దాత ముందుకు వచ్చిన విషయం విదితమే. ఇప్పటికే నూతన ధ్వజస్తంభానికి 64 అడుగుల కర్రను కూడా సిద్ధం చేశారు. ఏప్రిల్ 22న నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరుగనుంది. అనంతరం బంగారు రేకు తాపడం చేస్తారు. వేద పండితులు గొల్లపల్లి ఘనాపాఠీ, గంగాధరబట్ల గంగబాబు, చిట్టి శివ తదితరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఏఈఓ కృష్ణారావు, డీఈ ఉదయ్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి కాంట్రాక్టర్ మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

తుని: తుని జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుల్లిపాడు- నర్సీపట్నం స్టేషన్ల మధ్యలో రైలు నుంచి జారిపడి సంబంగి శ్రీనివాసరావు(45) మృతి చెందాడని ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. గురువారం అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న ఏపీ ఎక్స్‌ప్రెస్ నుంచి జారిపడి శ్రీనివాసరావు (వాసు) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన శ్రీనివాసరావు కాంట్రాక్టర్. వివాహం అయిన ఈయన కుమార్తె విశాఖపట్నంలో ఉంటున్నారు. కుమార్తెను చూసి తిరిగి వెళ్లేందుకు ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై తెలిపారు.

రౌతులపూడిలో రూ.4.50 లక్షల స్వాధీనం


ద్విచక్ర వాహనంతో పట్టుబడ్డ అప్పలనాయుడు

రౌతులపూడి: మండల కేంద్రమైన రౌతులపూడిలో ఎన్నికల నియమావళిలో భాగంగా స్థానిక మార్కెట్ సెంటర్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రౌతులపూడి గ్రామానికి చెందిన కర్రి అప్పలనాయుడు ద్విచక్ర వాహనంపై వస్తుండగా రూ.4.50 లక్షల నగదుతో గురువారం పట్టుకున్నారు. ఆ నగదుకు ఎలాంటి ఆధారాలు చూపించకపోవటంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎస్వీ రమణ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. తనిఖీల్లో పట్టుబడ్డ నగదును తహసీల్దారు కార్యాలయంలో స్వాధీన పరిచారు. నగదుకు సంబంధించి పత్రాలను సమర్పిస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి ఆ వ్యక్తికి నగదు అప్పగిస్తామని ఎస్వీ రమణ తెలిపారు.